క్లుప్తంగా

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి


సుమన్ (ఫైల్)

శాయంపేట : మండలంలోని ఆరెపల్లి గ్రామానికి చెందిన ఎడ్లె సుమన్(36) పురుగుల మందు సేవించి గురువారం రాత్రి మృతి చెందినట్లు ఎస్సై ప్రమోద్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం.. ఆరెపల్లి గ్రామానికి చెందిన ఎడ్లె సుమన్ వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. సుమన్ మద్యానికి బానిసై కుటుంబాన్ని పట్టించుకోవడం లేదు. తల్లిదండ్రులు ఇచ్చిన భూమిని తన అన్న అర్జున్‌కు రూ. 25లక్షలకు విక్రయించుకోగా లక్ష రూపాయలు సుమన్‌కి అందాయి. వాటిని మద్యానికి, జల్సాలకి వాడుకున్నాడు. ఈనెల 12న అర్జున్ 1లక్ష 50వేలు సుమన్ భార్య జ్యోతికి ఇచ్చాడు. అయితే డబ్బులు తనకు ఇవ్వాలని సుమన్ మద్యం సేవించి భార్య జ్యోతితో గొడవకు దిగాడు. మద్యం మత్తులో పురుగుల మందు సేవించాడు. కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. మృతుని భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కాంట్రాక్టర్‌పై చర్య తీసుకోవాలి

శాయంపేట : అంగన్‌వాడీ కేంద్రాలకు కోడిగుడ్లు సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని బీఎస్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు మగ్గం సుమన్ ఆరోపించారు. శుక్రవారం ఆయన పత్తిపాక అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. చిన్న సైజు కోడిగుడ్లను సరఫరా చేస్తున్నాడని ఆరోపించారు. తెల్లపురుగులు, తుట్టెలు కట్టిన బియ్యాన్ని వంటిచేసి గర్భిణులుకు, చిన్నారులకు అందిస్తున్నారని ఆరోపించారు. అయితే అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే కోడిగుడ్లను తూకం వేస్తే కిలో 300గ్రాముల పైన ఉంటేనే కేంద్రాల్లోకి అనుమతి ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీతారెడ్డి వివరించారు.

ఎమ్మెల్యే పరామర్శ

ధర్మసాగర్ : మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త బొడ్డు రణధీర్, రాపాకపల్లి గ్రామానికి చెందిన కందుకూరి సుర్జాన, కందుకూరి సుదర్శన్ అనారోగ్యంతో బాధపడుతూ హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి శుక్రవారం పరామర్శించారు.

'సిరికొండ' పరామర్శ

శాయంపేట : మండలంలోని కొప్పుల గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు, పీఏసీఎస్ డైరెక్టర్ బగ్గి రమేష్ కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి శుక్రవారం పరామర్శించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల మాజీ అధ్యక్షులు గుర్రం రవీందర్, నాయకులు సారయ్య, రమణారెడ్డి, గణేష్, విజమ్, రాకేష్, రవి ఉన్నారు.

ఆలయ డైరెక్టర్‌గా వికాస్‌రెడ్డి



ధర్మసాగర్ : జనగాం జిల్లా చిల్పూరు మండల కేంద్రంలోని బుగులు వేంకటేశ్వరస్వామి దేవాలయం డైరెక్టర్‌గా మండలంలోని పెద్దపెండ్యాల గ్రామానికి చెందిన బొల్లెద్దు వికాస్‌రెడ్డిని నియామకమయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తన నియామకానికి సహకరించిన స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిరకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పన్నులు వసూలు చేయాలి

దామెర : వందశాతం పన్నులు వసూలు చేయాలని డీపీఓ లక్ష్మీరమాకాంత్ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మండలంలోని దుర్గంపేట గ్రామాన్ని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం పలు రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మార్చి31వ తేదీలోపు వందశాతం పన్నులు వసూలుచేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. లక్ష్యం చేరుకునే విధంగా ప్రణాళికలు రూపొందించాలని అన్నారు. ఆయన వెంట ఎంపీఓ రంగాచారి, కార్యదర్శి సుకన్య తదితరులు ఉన్నారు.

కుట్టుశిక్షణతో స్వయంఉపాధి

శాయంపేట : కుట్టుమిషన్ శిక్షణ తీసుకున్న మహిళలు స్వయంఉపాధి పొందాలని జేఎస్‌ఎస్ సంస్థ ఏరియా సూపర్‌వైజర్ సుజిత్ అన్నారు. మండలంలోని గట్లకానిపర్తి గ్రామంలో ప్రజ్వల్ రైతు ఉత్పత్తిదారుల సంఘం క్షేత్ర సదుపాయకర్త కల్పన ఆధ్వర్యంలో జనశిక్షణ సంస్థ ప్రోత్సాహంతో మహిళలకు 90 రోజుల కుట్టుమిషన్ శిక్షణని అందించారు. శుక్రవారం ముగింపు కార్యక్రమం ఏర్పాటు చేయగా సుజిత్ మాట్లాడారు. కుట్టు మిషన్ నేర్చుకోవడమే కాదని, ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్‌లు కుట్టి స్వయంఉపాధి పొందాలని అన్నారు. ప్రాజెక్టు కార్యక్రమాలను అమలు చేసేందుకు జేఎస్‌ఎస్ సహకారంతో 20మందికి శిక్షణ అందించినట్లు తెలిపారు. శిక్షణ తీసుకున్న మహిళలు అధునాతన టెక్నాలజీని వినియోగించుకొని దుస్తులను కుట్టాలని తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లను అందించారు. ఈ కార్యక్రమంలో శిక్షణ నిర్వాహకురాలు మమత, బీసీఐ కోఫార్మర్స్ సునీత, అనురాధ, మహాలక్ష్మి, రోజా, స్రవంతి, దివ్య, సంధ్య, సుకన్య, సంగీత పాల్గొన్నారు.

పౌరులకు ఓటుహక్కు వజ్రాయుధం

- చైతన్య పరుస్తున్న ఉపాధ్యాయులు, అధికారులు
- సంకల్ప పత్రాలతో ప్రతిజ్ఞ


ఆత్మకూరు : పెద్దాపూర్‌లో మానవహారం చేపట్టిన విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఎల్కతుర్తి : పౌరులకు ఓటుహక్కు వజ్రాయుధమని వల్బాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బద్దం సుదర్శన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పాఠశాల ఆవరణంలో ఓటుహక్కు వినియోగంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి మానవహారం చేపట్టారు. అనంతరం ఓటరు సంకల్పపత్రం చదివి వినిపించారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచంలో భారతదేశం అత్యధిక జనాభా కలిగిన ప్రజాస్వామ్య దేశమని, భారత ప్రజాస్వామ్య సౌధం ఓటుహక్కు అనే పునాదిపై నిర్మించి ఉందన్నారు. అలాంటి ఓటుహక్కును ప్రజలందరూ స్వేచ్ఛగా, నిర్భయంగా, నిష్పక్షపాతంగా వినియోగించుకోవాలని సూచించారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్లందరూ ప్రశాంత వాతావరణంలో ఓటుహక్కు వినియోగించుకోవాలని కోరారు. ఉపాధ్యాయులు రఘురామ్, వాసంతి, రమేష్, వెంకటస్వామి, శ్రీనివాస్‌రెడ్డి, సుహాసిని, శ్రీదేవి, అనిత, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు : మండలంలోని అర్హులందరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని ఎంపీఓ చేతన్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని అక్కంపేట, పెద్దాపురం కామారం, నీరుకుళ్ల, పెంచికలపేట, నాగయ్యపల్లి గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో శుక్రవారం ఓటర్ అవగాహన కార్యక్రమం నిర్వహించి మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ ఓటు హక్కును నిర్భయంగా, స్వేచ్ఛగా ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు యాదగిరి, సంపూర్ణ, జితేందర్‌రెడ్డి, అనూష, సునీల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శాయంపేటలో..

శాయంపేట : మండలంలోని 18ఏళ్లు నిండిన యువతి, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శి మడికొండ రత్నాకర్ కోరారు. శుక్రవారం వివిధ గ్రామాల్లోగల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు మానవహారం చేపట్టగా ఆయన పాల్గొని ఓటుహక్కు ప్రాముఖ్యతను వివరించారు. ఇదివరకే ఓటుహక్కు కలిగిఉన్న వారు తప్పకుండా వినియోగించుకోవాలని కోరారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరకాలలో.

పరకాల : 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు పిలుపునిచ్చారు. శుక్రవారం వివిధ గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య దేశంలో ఓటు అనేది ఆయుధం అన్నారు. ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకుని మంచి సేవలను ఎన్నుకోవాలని సూచించారు. తహసీల్దార్‌వ భాస్కర్, సీఐ రవిరాజు, పంచాయతీ అధికారి భాస్కర్, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి శ్రీధర్ పాల్గొన్నారు.

ఐనవోలులో..

ఐనవోలు : విద్యార్థుల భవిష్యత్ ప్రజాస్వామ్యంతో ముడిపడి ఉందని పాఠశాల హెచ్‌ఎం చుంచుకాల లింగారావు అభిప్రాయపడ్డారు. మండలంలోని ఉడుతగూడెం శుక్రవారం పాఠశాలలో తెలంగాణ ఓటరు సంకల్ప పత్రం ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో భయం, పక్షపాతం లేకుండా కులం, మతం, ప్రాంతం, భాష ఇతర ప్రలోభాలకు లొంగకుండా ఓటుహక్కు వినియోగించుకునేలా విద్యార్థులు వారి తల్లిదండ్రులకు వివరించాలని కోరారు. అందుకు సంబంధించిన సంకల్ప పత్రంపై విద్యార్థులతో సంతకం చేయించి వారి తల్లిదండ్రులతో సంతకం తీసుకుని రావాలని సూచించారు. కార్యదర్శి దీపిక, అంగన్‌వాడీ టీచర్ ప్రణీత, రాధిక పాల్గొన్నారు.



పరకాల: ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు


ఎల్కతుర్తి : ఓటుహక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేస్తూ..


శాయంపేట : ప్రతిజ్ఞ చేస్తున్న రత్నాకర్, విద్యార్థులు


ఐనవోలు : సంకల్పపత్రం ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నడికూడ / ఐనవోలు/ కమలాపూర్: నడికూడ మండలంలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఏఈ విశ్వప్రసాద్ తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 గంటల వరకు నడికూడ, రాయపర్తి, నర్సక్కపల్లి, చౌటుపర్తి, ముస్త్యాలపల్లి అంతరాయం ఉండనున్నట్లు తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు చర్లపల్లి, నార్లపూర్, పులిగిల్ల గ్రామాల్లో అంతరాయం ఉండనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యుత్ వినియోగదారులు సహకరించాలని తెలిపారు. అదే విధంగా ఐనవోలు మండలంలోని గర్మిళ్లపల్లి గ్రామంలోని 11 కేవి అగ్రికల్చర్ ఫీడర్ పరిధిలో లైన్ మరమ్మత్తుల కారణంగా శనివారం సాయంత్రం 4.30 గంటల నుంచి 6.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఇన్‌చార్జ్ ఏఈ శివకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే కమలాపూర్ మండలంలోని శనిగరం, గూనిపర్తి 33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏఈ రాములు తెలిపారు. చెట్ల కొమ్మలు తొలగించేందుకు శనిగరం, మాదన్నపేట, గోపాల్‌పూర్, లక్ష్మీపూర్, నేరెళ్ల, గూనిపర్తి, అంబాల, శ్రీరాములపల్లి తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

ఎస్సారెస్పీ నీటికి అడ్డుకట్ట

నడికూడ : సాగునీరు లేక వరిపొలాలు ఎండుతుండగా అధికారులు శుక్రవారం ఎస్సారెస్పీ నీటిని విడుదల చేశారు. మండల పరిధిలోని నర్సక్కపల్లి వద్ద గుర్తుతెలియని వ్యక్తులు ఎస్సారెస్పీ కెనాల్ గేటువాల్వ్ మూసివేయడతో నడికూడ, రాయపర్తి, పులిగిల్ల, వరికోల్, చర్లపల్లి, గ్రామాలకు సాగునీరు రాకపోవడంతో రైతులు శుక్రవారం రాత్రి కెనాల్‌ను పరిశీలించారు. కెనాల్ గెటువాల్వ్ మూసి ఉండటంతో రైతులు సంబంధిత అధికారులకు సమాచారం అందించారు. ఎస్సారెస్పీ జలాలు పూర్తి స్థాయిలో అందించాలని రైతులు కోరుతున్నారు.

'పది' పరీక్షలకు ఏర్పాట్లు చేయాలి


మాట్లాడుతున్న ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు

ఐనవోలు : ఈనెల 18వ తేదీన నుంచి ప్రారంభమయ్యే పదోతరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ పాఠశాలను శుక్రవారం ఆయన సదర్శించారు. ఈ సందర్భంగా మండల వ్యాప్తంగా 4 పరీక్ష సెంటర్లలో విధులు నిర్వహించే ఇన్విజిలేటర్‌లకు ఆర్డర్ కాపీలను అందించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రభుత్వం పదోతరగతి పరీక్షలను ఎటువంటి అవాంతరాలు, అవకతవకలు లేకుండా పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇన్విజిలేటర్ విధులు నిర్వహించే ఉపాధ్యాయులు విద్యార్థులకు ఎలాంటి ఆటంకాలు కలుగకుండా, ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేందుకు కావాల్సిన చర్యలు తీసుకోవాలని కోరారు. పరీక్ష కేంద్రాల్లో సెల్‌ఫోన్‌లకు అనుమతి లేదన్నారు. ఒకవేళ తీసుకువస్తే చీఫ్ సూపరింటెండ్‌కు అప్పగించాలన్నారు. అలాగే ఒంటిపూట బడులు సక్రమంగా నిర్వహించాలని, సమయపాలన పాటించాలని చెప్పారు. మంచినీరు అందుబాటులో ఉంచాలని, మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, మధుకర్, సారయ్య, మహేందర్‌రెడ్డి, లక్ష్మయ్య, మహేందర్, ఐఈఆర్‌పీ భవర్, సీఆర్‌పీ రాజ్‌కుమార్, రేవతి పాల్గొన్నారు.

విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దు : హెచ్‌ఎం


ఉపాధ్యాయులతో పదోతరగతి విద్యార్థులు

కమలాపూర్ : పదోతరగతి విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దని హెచ్‌ఎం రాజమల్లయ్య అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలోని పదోతరగతి విద్యార్థులకు తొమ్మిదో తరగతి విద్యార్థులు శుక్రవారం వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రాజమల్లయ్య మాట్లాడుతూ.. విద్యార్థులు సానుకూల దృక్పథంతో ఆలోచించాలని, ప్రశ్నాపత్రాన్ని క్షుణ్ణంగా చదివి జవాబులు రాయాలని అన్నారు. పరీక్ష కేంద్రంలో సమయాన్ని వృథా చేయొద్దన్నారు. పదోతరగతిలో మంచి ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థుల ఆటపాటలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు పీడబ్ల్యూసీ పవన్‌కుమార్, అన్నమ్మ, సువర్ణ, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంపై శ్రద్ధ వహించాలి

- డీఆర్డీఓ నాగపద్మజ


తక్కళ్లపహాడ్‌లో నర్సరీని పరిశీలిస్తున్న నాగపద్మజ

దామెర : నర్సరీల్లోని మొక్కల పెంపకంపై శ్రద్ధ వహించాలని డీఆర్డీఓ నాగపద్మజ సూచించారు. మండలంలోని 14 గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలను శుక్రవారం గ్రామీణాభివృద్ధి శాఖకు చెందిన నాలుగు బృందాలు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాయి. ఈ సందర్భంగా గ్రామాలవారీగా మొక్కల టార్గెట్, పెంచుతున్న మొక్కల రకాలు, వివరాలను తెలుసుకున్నారు. అనంతరం ఖాళీ సంచులు, చనిపోయిన మొక్కలను గమనించి పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా వందశాతం పూర్తిచేయాలని అన్నారు. తనిఖీల్లో అదనపు పీడీ శ్రీనివాసరావు, ఏపీఓ శ్రీనివాస్‌రెడ్డి, ప్లాంటేషన్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి బృందాలు, ఏపీఓ శారద, ఈసీ రాజేష్, టీఏలు ప్రిసిల్లా, సురేందర్ పాల్గొన్నారు.

భ్రూణహత్యల నివారణకు కృషి చేయాలి


ప్రతిజ్ఞ చేస్తున్న సిబ్బంది

దామెర : భ్రూణహత్యల నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జంగం రాణి అన్నారు. మండలంలోని పులుకుర్తిలో శుక్రవారం బేటీ-బచావో బేటీ- పడావో కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. బాలబాలికల మధ్య వ్యత్యాసాన్ని తగ్గించి ఆడపిల్లల జననాలను ప్రోత్సహించాలని అన్నారు. ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణించడం శుభపరిణామంగా అభివర్ణించారు. బాల్య వివాహాలు నేరమని, వాటిని పోత్సహిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని అన్నారు. చిరుధాన్యాలతో వంటలు తయారుచేసి పోషణ అభియాన్‌పై ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, కారోబార్ ఆనంద్, వీఓఏ స్వర్ణలత, మహిళా సంఘాల ప్రతినిధులు రజిత, భాగ్యలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు సరళ, ఉదయ, జయ, రేణుక పాల్గొన్నారు.

పెండింగ్ క్లైమ్స్ చెల్లించాలి

శాయంపేట : కార్మికులకు రావలిసిన మ్యారేజ్ స్కీము, డెలీవరీ, నేచురల్ డెత్ స్కీము, యాక్సిడెంట్ డెత్ స్కీమ్‌కు సంబంధించిన బిల్లులు చెల్లించాలని భవన నిర్మాణ తాపీ మేస్త్రీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు పల్లెబోయిన ఓదేలు కోరారు. లేబర్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసినా న్యాయం చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరారు.

ఫాదర్ కొలంబో జయంతి



ధర్మసాగర్ : మండలంలోని కరుణాపురంలో ఫాదర్ కొలంబో 97వ జయంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విచారణ గురువులు ఫాదర్ సుధాకర్, స్టేషన్ ఘన్‌పూర్ ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు సింగపురం దయాకర్ మాట్లాడారు. కరుణాపురం సృష్టి కర్త ఫాదర్ కొలంబో ఉమ్మడి వరంగల్ జిల్లాలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారని గుర్తు చేశారు. బడుగు బలహీన వర్గాలకు, కుష్టు వ్యాధిగ్రస్తులకు, నిరుపేదలకు విద్యా, వైద్యం అందించారని కొనియాడారు. అనంతరం కొలంబో విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ సర్పంచ్ అనిల్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు శిఖరవి, బాలస్వామి, గుర్రం యేసు బాబు, ప్రతీష్, గ్రామపెద్దలు, మహిళలు, సెయింట్ అగస్టిన్స్ సభ్యులు పాల్గొన్నారు.

నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలి



ధర్మసాగర్ : మండలంలోని క్యాతంపల్లి గ్రామంలో ముదిరాజ్ కమ్యూనిటీహాల్ భవన నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని జెడ్పీటీసీ పిట్టల శ్రీలత సూచించారు. జెడ్పీటీసీ నిధుల నుంచి కమ్యూనిటీ భవన నిర్మాణానికి రూ.5 లక్షలు, బోరు ఏర్పాటుకు రూ. 1.50 లక్షల నిధులు మంజూరు చేసి శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గ్రామాభివృద్ధి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. గ్రామంలోని బొడ్రాయి వద్ద రెండు లక్షల వ్యయంతో సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటుకు పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు అవనిజారెడ్డి, నర్సింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ మహేందర్, విప్లవ్‌కుమార్‌రెడ్డి, పీఆర్ ఏఈ భార్గవి, పంచాయతీ కార్యదర్శి సుప్రియ, మాజీ ఉపసర్పంచ్ రాజు, ముదిరాజ్ సంఘం గ్రామ శాఖ అధ్యక్షుడు కుమారస్వామి, కార్యదర్శి కుమార్, సంఘం నాయకులు పాల్గొన్నారు.

గ్రంథాలయం ప్రారంభం

ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలంలోని వంగర గ్రామంలో గల పీవీరంగారావు గురుకుల పాఠశాల, బాలికల కళాశాలలో శుక్రవారం గ్రంథాలయాన్ని అభయ పౌండేషన్ సంస్థ, ట్రిస్ సంస్థ సహకారంతో ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బాలచంద్ర స్వామిజీ శుక్రవారం ప్రారంభించారు. పదోతరగతి విద్యార్థుల కోసం స్వయంగా రచించిన దిక్సూచి క్యాంపస్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మమత, ఎడ్యూకేషనలిస్టు అరుణోదయ, కళాశాల ప్రిన్సిపాల్ సురేఖ సిబ్బంది పాల్గొన్నారు.

స్వయంపాలన దినోత్సవం



ఐనవోలు : మండలంలోని రాంనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠాలు బోధించారు. హెచ్‌ఎంగా బాషబోయిన మానస, తెలుగు టీచర్లుగా బి.మనస్వి, ఎం శ్రీరామ్, ఇంగ్లిష్ టీచర్లుగా బి.సాక్షిత, ఎ.శివాని, గణిత టీచర్లుగా వై.రియాన్సిక, వై.సాత్విక్, ఈవీఎస్ టీచర్‌గా బి. రిషికుమార్, పీఈటీగా ఎం.శివాని వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు బాలోజు బ్రహ్మాచారి పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం


శాయంపేట : మాట్లాడుతున్న సునీతారెడ్డి


ఆత్మకూరు : అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

శాయంపేట : పౌష్టికాహారంతో బాలింతలు, గర్భిణులు, పిల్లలు ఆరోగ్యవంతంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీతారెడ్డి అన్నారు. మండలంలోని కొత్తగట్టుసింగారం అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ పక్వాడ్ కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. బాల్య ఆరంభ దశలో పిల్లలకు ఏవిధంగా విద్యను బోధిస్తే అర్థమవుతుందో తల్లులకు వివరించారు. పిల్లలకు ఎల్‌కేజీ, యూకేజీ వర్క్స్ బుక్స్, ప్రీస్కూల్ కిట్లు, ఆట వస్తువులు, బొమ్మలుతో ఆడించి ఆహ్లాదకర వాతావరణంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. పిల్లల ఎదుగుదలకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. అనంతరం తల్లులతో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు మధుర, రేవతి, సరిత, జయసుధ, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

ఆత్మకూరు : చిరుధాన్యాలతో గర్భిణులకు, బాలింతలకు, పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని అంగన్‌వాడీ టీచర్లు సునీత, చంద్రకళ, రాజేశ్వరి, ఉమాదేవి అన్నారు. మండలంలోని గుడెప్పాడ్‌లో మండల పరిషత్ పాఠశాలలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ పక్వాడ్ కార్యక్రమం నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గర్భిణులకు, బాలింతలకు, పిల్లలకు చిరుధాన్యాల వలన కలిగే లాభాలను వివరించారు. అనంతరం చిరుధాన్యాల చిత్రపటాలను ప్రదర్శించి వాటి ప్రాముఖ్యతను వివరించారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటే పుట్టబోయే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయాలు, గర్భిణులు, బాలింతలతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ప్రజలకు లబ్ధి


ఆత్మకూరు : పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే


కమలాపూర్ : పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రణవ్

ఆత్మకూరు : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో సబ్బండవర్గాలకు లబ్ధి జరుగుతుందని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీల నాయకులు, కార్యకర్తలు శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. వీరికి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రేవూరి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పనిచేస్తోందన్నారు. పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి ఆకర్షితులైన వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు తెలిపారు. పేదల సంక్షేమం కోరేది కాంగ్రెస్ అన్నారు. మండల అధ్యక్షుడు కమలాపురం రమేష్, నాయకుడు సుధాకర్‌రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వాసు, ప్రభాకర్, రాజు, శ్రీనివాస్‌రెడ్డి, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

దామెర: చంద్రగిరి చెన్నకేశస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని కోగిల్వాయి చంద్రగిరి గట్టులో కొలువైన చంద్రగిరి చెన్నకేశవస్వామి ఆలయాన్ని శుక్రవారం దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గుట్టపై జరిగే జాతరకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. గుట్టపై కాకతీయుల కాలంనాటి మూడు గుడులు, ఏడు గుండాలు ఉండడం విశేషమన్నారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించి ఆలయాభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు మన్నెం ప్రకాశ్‌రెడ్డి, సీనియర్ నాయకులు బీరం సుధాకర్‌రెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

కమలాపూర్ : టీడీపీ మండల అధ్యక్షుడు పెరుమాండ్ల పరుశరాములుగౌడ్ శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఒడితల ప్రణవ్ కండువా కప్పి ఆహ్వానించారు. పరుశరాములుతో పాటు బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన ఆడెపు శ్రీకాంత్, పద్మశాలి సంఘం ఉపాధ్యక్షుడు దాసి శంకరయ్య, నాయకులు మెండు నర్సయ్య, బీజేపీకి చెందిన మౌటం బాలాజీ, మౌటం రాజు, వెంగళ రాము, పిల్లి శ్రీనివాస్ పలువురు చేరారు.